
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ఆదివారం 19 అక్టోబరు 2025
5

‘మేమెంతో మాకంత..’


భూపాలపల్లి ఆర్టీసీ బస్‌డిపో ఎదుట ధర్నా చేస్తున్న వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు

ఉద్యమించిన బీసీలు

- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విజయవంతంగా బీసీ బంద్
- నినాదాలతో మార్మోగిన రహదారులు
- రోడ్డెక్కిన విద్యార్థులు, బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు


ములుగు జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

భూపాలపల్లిటౌన్/ములుగు టౌన్ అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మేమున్నంత మాకు రిజర్వేషన్లు ఇవ్వాలి.. 42 శాతం రిజర్వేషన్ కోటా తప్పనిసరి ఇవ్వాలి అని బీసీలు నడుం బిగించారు. తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేసేలా పార్టీలకతీతంగా నాయకులు, వివిధ బీసీ సంఘాల నాయకులు, మేధావులు, విద్యార్థులు రహదారులపై ర్యాలీలు తీశారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో బీసీల బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు సైతం స్వచ్ఛందంగా బంద్‌ను పాటించాయి.

- మిగతా 8లో

రైజింగ్ విజన్ సర్వేలో భాగస్వాములు కావాలి

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రానున్నరోజుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్-2047 అంశాలతో డాక్యుమెంట్‌ను రూపొందిస్తుందని, ఈ సర్వేలో ఉద్యోగులు, అన్నివర్గాల వారు భాగస్వాములు కావాలని కలెక్టర్ టీఎస్. దివాకర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రతీ పౌరుడు పాల్గొనేలా సిటిజన్ సర్వే చేపట్టారని అన్నారు. ఈనెల 25 వతేదీన జరిగే సర్వేలో ప్రజలు, ఉద్యోగులు పాల్గొనాలని తెలిపారు. సర్వే లింకును, క్యూ ఆర్ కోడ్‌ను తమతమ కార్యాలయాల్లో ప్రదర్శించడంతోపాటు విస్తృత ప్రచారం చేపట్టాలని ఆయన ఆదేశించారు.

కొలువుదీరిన క్రాకర్స్ దుకాణాలు


క్రాకర్స్ దుకాణాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

పరిశీలించిన భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే

కృష్ణకాలనీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో క్రాకర్స్ దుకాణాలు కొలువు దీరాయి. ఈ నెల 20న దీపావళి పండగను పురస్కరించుకొని టపాసుల విక్రయాలు జరపడం పరిపాటే. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలో గల కూరగాయల మార్కెట్‌లో మొత్తంగా 23 దుకాణాలకు అధికారులు అనుమతులు ఇచ్చారు. దీంతో ఆ దుకాణాలు ప్రారంభమయ్యాయి. ఈ సారి గతంలో కంటే భిన్నంగా తడకలతో కాకుండా ఇనుప రేకులతో షెడ్లను ఏర్పాటు చేశారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

దీపావళి పండగ దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న క్రాకర్స్ దుకాణా ల్లో భద్రతా ప్రవణాలు పాటించాలని జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే సూచించారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీ క్రీడా మైదానంలోఏర్పాటు చేసిన దుకాణాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రతీ దుకాణం అనుమతి పొందాలన్నారు. ఏదేని ప్రమాదం జరిగితే రక్షణ చర్యలు చేపట్టేలా పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్‌కుమార్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎస్సై సతీష్ తదితరులు ఉన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన సదస్సులు

కాటారం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):రైతులు ముందుగా కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించుకోవాలని ఎంఏవో పూర్ణిమ, ఏఈవోలు రాజన్న, దీపక్, ఆస్మా, రాంబాబు, యోగిత అన్నారు. మండలంలోని చిద్నెపల్లి, చింతకాని, రేగులగూడెం, కాటారం, దామెరకుంట వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో శనివారం రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ నెల 24వరకు మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని పత్తి రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఏవో, ఏఈవోలు కోరారు. సదస్సుల్లో ఏఈవోలు రైతులకు సంబంధించి ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబర్లను అప్‌డేట్ చేస్తేనే పత్తి విక్రయాలకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో రైతులు తదితరులు ఉన్నారు.


రైతుల నుంచి పత్తి పంటల వివరాలు సేకరిస్తున్న ఏవో, ఏఈవో

ఈ సారి అంతంతే..

- మద్యం టెండర్లకు ముగిసిన గడువు
- 59 షాపులకు 1500 దరఖాస్తులు దాఖలు
- గతంలో ఎన్నడూ లేని విధంగా తగ్గిన సంఖ్య
- ధర పెరగడమా..? లేక కుమ్మక్కు వ్యవహారం కారణమా..?
- తెల్లవారుజామున వరకు దరఖాస్తుల స్వీకరించామన్న అధికారులు


దరఖాస్తులను సమర్పిస్తున్న వ్యాపారులు

కృష్ణకాలనీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల టెండర్లకు స్పందన కరువైంది. దుకాణాల కేటాయింపు ద్వారా రాష్ట్ర ఖజానాకు కిక్కును ఇవ్వాలన్నా సర్కారు యోచన ఒకింత బెడిసికొట్టే సూచనలే కనిపిస్తున్నాయి. గతంలో దరఖాస్తుల విక్రయం ద్వారానే ఎక్సైజ్‌కు భారీ ఆదాయం లభించింది. కానీ, ఈసారి ఏ కారణం చేతో దరఖాస్తుల విక్రయాలు మందకొడిగా సాగాయి. దాదాపు నెల రోజుల ముందే నోటిఫికేషన్ విడుదల చేసినా మద్యం దుకాణాలకు వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపకపోవడం చర్చనీయాంశంగా మారింది. భూపాలపల్లి, ములుగు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో మొత్తం 59 మద్యం దుకాణాల కేటాయింపునకు దరఖాస్తులు స్వీకరించగా శనివారం రాత్రి 10 గంటల వరకు కేవలం 1500 దరఖాస్తులు మాత్రమే రావడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది. అది కూడా గడిచిన మూడు రోజుల వ్యవధిలోనే దరఖాస్తులు 700పైగా రావడం విస్తృత చర్చ జరుగుతోంది.

అందుకోని అబ్కారీ అంచనాలు ..?

ఈ ఏడాది భారీగానే దరఖాస్తులు వస్తాయని ఆలోచన చేసిన అబ్కారీ అంచనాలు తలకిందులయ్యాయి. ఈ దఫా దరఖాస్తుల సంఖ్య భారీగా తగ్గడానికి దరఖాస్తు రుసుము రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షలకు పెంచడమే కారణమని పైకి చెబుతున్నా.. అసలు మతలబ్ వేరే ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఈ వ్యాపారంలో రాణిస్తున్న సిండికేట్లు రహస్యంగా సమావేశమై ఉమ్మడిగా దుకాణాలను చేజిక్కించుకునేందుకు వ్యూహాలు రచించారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా షెడ్యూల్డ్ తెగలకు కేటాయించిన మద్యం దుకాణాలకు సంబంధించి ప్రస్తుతం వ్యాపారంలో ఉన్న వ్యక్తులే బినామీలుగా దరఖాస్తులు చేయిస్తున్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. ఒక్కో రిజర్వ్‌డ్ దుకాణానికి ఈ వ్యాపారులే 3 నుంచి 4 చొప్పున దరఖాస్తులు వేయించారని తెలిసింది. ఇందుకు గాను సదరు దరఖాస్తుదారులతో ముందస్తు ఒప్పందాలు చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బినామీలుగా వ్యవహరిస్తున్న వారు ఇతరులకు ఒక వేళ మద్యం దుకాణం లక్కీ డ్రాలో వస్తే దరఖాస్తు రుసుమును వారు చెల్లించాల్సిన అవసరం లేకుండా 70 శాతం ఉచితంగా ఇస్తామని హామీ పత్రాలు రాసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా పెట్టుబడి కూడా పెట్టాల్సిన అవసరం లేదని, అంగీకార పత్రాలు సైతం రాసుకున్నట్లు తెలిసింది. ఈ పరిమాణాలన్నింటిని పరిశీలిస్తే జిల్లాలో దరఖాస్తుల సంఖ్య నామమాత్రంగా ఉండటానికి సిండికేట్లే చక్రం తిప్పారనే ఆరోపణలు బలంగా వినవస్తున్నాయి.

గతంలో వచ్చిన దరఖాస్తులు ఆదాయం

సంవత్సరం	దరఖాస్తులు	ఆదాయం
2019-21	1575	31 కోట్లు
2021-23	1905	38 కోట్లు
2023-25	2161	43.22 కోట్లు
2025-27	1500	31.65 కోట్లు

బంద్‌తో డీడీల కోసం హైరానా..

జిల్లా వ్యాప్తంగా 42 శాతం రిజర్వేషన్ల అమలుకై నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ బంద్‌లో బ్యాంకులు సైతం పాల్గొన్నాయి. శనివారం ఉదయం నుంచి బ్యాంకులు తెరుచుకోకపోవడంతో ఆశావాహులంతా హైరానా పడ్డారు. ఇదే రోజు మద్యం దుకాణాల గడువు ముగింపుతో ఆందోళన చెందారు. దీంతో బ్యాంకు అధికారులతో పరిచయాలు ఉన్న వ్యక్తులు అటుఇటు తిప్పలపడి డీడీలు పొందగా.. ఇంకొంత మంది మధ్యాహ్నం బ్యాంకులు తెరుచుకునేంత వరకు వేచి చూసి తదుపరి హుటాహుటిన డీడీలు తీశారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో జిల్లా యువజన క్రీడల అధికారి, కోచ్‌లు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఏటూరునాగారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ములుగులో నిర్వహించిన వరంగల్ జిల్లా స్థాయి కరాటే సెలెక్షన్లలో ఏటూరునాగారం మండలానికి చెందిన విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అయితే, శుక్రవారం ములుగులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటారు. మండల కేంద్రానికి చెందిన వసంత విశాల్ సాయి యాదవ్, ఎమ్డీ. సుమీర్, జి. గణేష్, బి. అన్వేష్, ఎల్. చరణ్, ఎల్. దినేష్, అభినయ్, ఆర్. లోకిత్, అంజలి పోటీలో సత్తా చాటి బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా యువజన క్రీడల అధికారి సర్దార్ సింగ్, కోచ్ ఎమ్డీ. హుస్సేన్, జిల్లా కరాటే అసోసియేషన్ కార్యదర్శి ఎమ్డీ. అబ్బు, విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. కాగా, డిసెంబరు నెలలో పెద్దపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలోనూ క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన చాటి ములుగు జిల్లాకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



అజయ్ (ఫైల్)

రఘునాథపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జనగామ జిల్లా రఘునాథ పల్లి మండలం జాఫరగూడెంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తోకల యాదగిరి-సువర్ణ దంపతులకు అజయ్(23)తోపాటు మరో కుమారుడు ఉన్నాడు. కొద్దిపాటి మతిస్థిమితం కోల్పోయిన అజయ్ తల్లిదండ్రుల తో గొడవ పడి మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిపోయి గ్రామ శివారులో ఉన్న చెట్టుకు ఉరి వేసుకున్నాడు. తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాపన్న కోట సంరక్షణకు కృషి

● రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి
● ఖిలాషాపూర్ పాపన్న కోటను పరిశీలన

రఘునాథపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సర్వాయి పాపన్న కోట సంరక్షణకు కృషిచేస్తానని, అలాగే అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తానని రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి పేర్కొన్నారు. శనివారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌లోని కోటను ఉప సంచాలకులు డాక్టర్ పి.నాగరాజు, ఎన్.నర్సింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ జనగామ డి.బుజ్జితో కలిసి పరిశీలించారు. అర్జున్ రావు మాట్లాడుతూ కోట బురుజులు, గోడలపై పెరిగిన చెట్లను తొలగించాలని, కోట చారిత్రక, నిర్మాణాత్మక ప్రాముఖ్యతను వివరించే బోర్డులను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కూలిపోయిన, దెబ్బతిన్న కోట భాగాలను మోర్టార్ కట్టడ సాంకేతికతతో పురుద్ధరించి, చారిత్రక స్వరూపం కాపాడటానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పాండవుల గుట్టలకు ప్రపంచస్థాయి పర్యాటకులు

రేగొండ (ఆంధ్రజ్యోతి): రేగొండ మండలంలోని పాండవుల గుట్టలకు ప్రపంచస్థాయి పర్యాటకులను ఆకర్షించేటటువంటి చారిత్రక, ప్రకృతి సంపద ఉందని రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు కూతాడి అర్జునరావు అన్నారు. మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారులో ఉన్న పాండవుల గుట్టలు, బుగులోని జాతర గుట్టలు, మండల కేంద్రంలోని పురాతన రామలింగేశ్వరసామి ఆలయాన్ని పురావస్తు శాఖ అధికారులతో కలిసి సంచాలకులు అర్జునరావు సందర్శించారు. ఈ సందర్భంగా పాండవుల గుట్టల పైకి ట్రెక్కింగ్ చేసి రాతి చిత్రాలను పరిశీలించారు. రాతి కొండల ఆకృతులను, ప్రకృతి పచ్చదనాన్ని చూసి ఇంతటి పురాతన గుట్టలకు తగిన గుర్తింపు వచ్చేలా కృషి చేస్తానన్నారు. గడిపల్లిలోని రామలింగేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి ప్రభుత్వానికి నివేదిక అందచేస్తానని తెలిపారు. కోటంచ లక్ష్మీనరసింహస్వామి, నాపాక, బుగులోని వెంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధి తమని ఆకట్టుకుందని అన్నారు. సందర్శించిన వారిలో ఉప సంచాలకులు నాగరాజు, సాయికిరణ్, కాంగ్రెస్ రేగొండ టౌన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



పాపన్న కోటను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో నెలకొన్న విద్యుత్‌లో ఓల్టేజీ సమస్యలను నివారణకు చేపట్టాల్సిన సబ్ స్టేషన్ల నిర్మాణంకు సంబంధించిన ప్రతిపాదనల, పత్రాలను ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి హన్మకొండలోని ఆయన కార్యాలయంలో శనివారం కడియం శ్రీహరి అందించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి నూతన ఆపరేషన్ విభాగాలను ఏర్పాటు చేయాలని సీఎండీకి ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు.

చిలుపూర్, లింగాల ఘనపురం, జఫర్‌గడ్ మండలాల పరిధిలో ఒక్కో ఆపరేషన్ విభాగాలు ఉన్నాయని, మూడు మండలాలలో అదనంగా ఒక్కో విభాగంను ఏర్పాటు చేయాలని, వాటిలో జఫర్‌గడ్ మండలంలో కూనూరులో, చిలుపూరు మండలంలో మల్కాపూర్‌లో, లింగాలఘనపురంలో వడిచర్లలో ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. జఫర్‌గడ్ మండల పరిధిలో నెలకొన్న లో ఓల్టేజీ సమస్యను నివృతి చేయటానికి 132/33 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. నారాయణపురంలో, చిలుపూరు నష్కల్, పల్లగుట్ట గ్రామాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్లు మంజూరి చేయాలని సీఎండీని కోరినట్లు తెలిపారు.



ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

పత్తి విక్రయానికి స్లాట్ బుకింగ్ తప్పనిసరి: జనగామ కలెక్టర్

జనగామ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పత్తి విక్రయానికి స్లాట్ బుకింగ్ తప్పనిసరని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పత్తి విక్రయానికి కప్పాస్ కిసాన్ యాప్‌లో రైతులు తప్పనిసరిగా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు. రైతులు తమ ఆధార్ నంబరు, పంట వివరాలు, క్రాప్ బుకింగ్ వివరాలతో యాప్‌లో లాగిన్ కావాలని స్పష్టం చేశారు. ఈ యాప్ ద్వారా రైతులకు సరైన ధర అందించడం, మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు విక్రయించే అవకాశం కల్పించడం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ సభ్యులు గ్రామ స్థాయిలో రైతులకు యాప్‌పై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు.

ప్రేమవిఫలమై..

● గడ్డిమందు తాగిన యువకుడు
● చికిత్స పొందుతూ మృతి



రాజు (ఫైల్)

ఇనుగుర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ విఫలమై.. రెండురోజుల క్రితం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గడ్డిమందు తాగడంతో చికిత్స పొందుతూ ఇనుగుర్తికి చెందిన యువకుడు శనివారం మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి ఎస్ఐ జి.కరుణాకర్ తెలిపిన ప్రకారం.

ఇనుగుర్తికి చెందిన ఆలకుంట్ల కొమురమల్లు -స్వరూప దంపతులకు కుమారు డు ఆలకుంట్ల రాజు (27), ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రాజు గత కొన్నేళ్లుగా భూపాలపల్లిలో వడ్డెర పని చేస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం భూపాలపల్లికి చెందిన ఓ యువతి (25)ని ప్రేమించాడు. అయితే ఆమె రాజును వివాహం చేసుకునేందుకు తిరస్కరించడంతో, ఈనెల 16న సదరు యువతి ఇంటికి వద్దకు వెళ్లి గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు రాజును తొలుత వరంగల్ ఎంజీఎంకు, అక్కడి నుంచి తొర్రూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ తొర్రూరులో రాజు మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు. తమ కుమారుని మృతికి ఎవరూ కారణం కాదని తండ్రి కొమురమల్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటన చోటు చేసుకున్న ప్రాంతం భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండడంతో కేసును అక్కడికి బదిలీ చేయనున్నట్లు ఎస్ఐ వివరించారు.

అక్రమాలకు తావు లేకుండా పనులు చేపట్టాలి



సామాజిక తనిఖీ సమావేశంలో పాల్గొన్న డీఆర్డీవో బాలకృష్ణ

చిట్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు తావులేకుండా పనులు చేయించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీఆర్డీవో బాలకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 16 విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శనివారం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై మండల ప్రజావేదిక కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామాల వారీగా సోషల్‌ఆడిట్ బృందాలు గమనించిన తప్పులను చదివి వినిపించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ పని ప్రదేశాల్లో కొలతల్లో తేడాలు, జాబ్ కార్డుల్లో అవకతవకలు, మస్టర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పనిచేసిన వారి ఖాతాల్లో డబ్బులు జమకా కపోవడం లాంటి సమస్యలు ఎక్కువగా రావడం జరిగిందన్నారు.

సామాజిక తనిఖీలో డీఆర్డీవో బాలకృష్ణ

పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, పీఆర్ ఏఈని బాధ్యులుగా చేసి రూ.1,28,441 జరిమానాలు విధించడం జరిగిందన్నారు. మండల వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులకు రూ. 54737, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ. 39165, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.9908, పీఆర్ ఏఈకి రూ.24631 జరిమానాలు విధించినట్లు తెలిపారు. తప్పిదాలు పునరావృతం కాకుండా అధికారులు, సిబ్బంది ఉపాధిహామీ పనులు జరిపించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు క్వాలిటీ కంట్రోల్ అధికారి ధరమ్‌సింగ్, డీవీసీ రుబీనాబేగం, ప్రవీణ్, శ్రీనివాస్, ఎంపీడీవో జయశ్రీ, ఏపీవో అలీం, పీఆర్ ఏఈ అరుణ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న యువకుల అరెస్ట్

900గ్రాముల గంజాయి, 4సెల్‌ఫోన్లు స్వాధీనం

కాటారం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి గంజాయి ని తాగడంతో పాటు ఇతరులకు విక్రయిస్తున్న యువకులకు పోలీసులు చెక్ పెట్టారు. పెట్రోలింగ్ చేస్తుండగా గంజాయిని కలిగి ఉన్న గారెపల్లి, కాటారం గ్రామాలకు చెందిన ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు శుక్రవారం బయ్యారం గ్రామ సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా ఆరుగురు యువకులు అనుమానస్పదంగా కనిపించారు.

పోలీసులు ప్రశ్నిస్తున్న క్రమంలో పారిపోయే ప్రయత్నం చేయగా వారిని చాకచక్యంగా పట్టుకుని విచారించగా తాము గంజాయి తాగడంతో పాటు గంజాయిని ఇతరులకు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. వారిని గారెపల్లి గ్రామానికి చెందిన వివేక్, అఖిల్, గణేష్, శ్రీకాంత్, అస్లాం, కాటారం గ్రామానికి చెందిన పరిహూర్థం గా గుర్తించారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన నిఖిల్‌రాజ్ అనే వ్యక్తి దగ్గర 950 గ్రాముల గంజాయిని తీసుకుని అందులోంచి 50 గ్రాములను తాగినట్లు యువకులు వెల్లడించారు. దీంతో వారితో పాటు 900గ్రాముల గంజాయిని, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.



భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం రహదారిపై కురుస్తున్న మంచు

మంచు మొదలైంది

అప్పుడే మంచుపడడం మొదలైంది.. ఉదయం ఆరు గంటల వరకు మంచుదుప్పట్లు ప్రధాన రహదారిని కమ్మివేశాయి. ఎదురుగా వస్తున్న వాహనం కనిపించాలంటే.. కొంచెం నెమ్మదిగా వెళ్లాల్సిందేననే సంకేతాలు రానే వచ్చాయి. మంచుకురిసే సమయంలో వాహనదారులు ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిదని చూపరులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చాలా రోడ్డు ప్రమాదాలు ఉదయాన్నే జరగడం గమనార్హం. ఈ చిత్రాలను భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్‌మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి

మార్కెట్‌కు మూడు రోజుల సెలవు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం పురస్కరించుకుని స్టేషన్ ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి తెలిపారు. 19, 20, 21న దీపావళి నోములు సందర్భంగా సెలవన్నారు. 22నుంచి మార్కెట్ యథావిధిగా మార్కెట్ ఉంటుందని పేర్కొన్నారు. రైతులు ఈ విషయం గమనించి సెలవు రోజుల్లో మార్కెట్‌కు సరుకులు తీసుకు వచ్చి ఇబ్బందులు పడొద్దని కోరారు.

కాళేశ్వరంలో పూజలు



కాలసర్ప దోష నివారణ పూజల్లో పాల్గొన్న భక్తులు

మహదేవపూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో శనివారం ధన త్రయోదశి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి సన్నిధానంలో కాలసర్ప దోష పూజలు, నవగ్రహ పూజలు, అభిషేకాలతో పాటు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు



జఫర్‌గడ్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం, సీపీఐ పార్టీల శ్రేణులు



సీపీఎం, సీపీఐ పార్టీల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ మండల శ్రేణులు

కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ నినాదాలు

● స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎదురెదురుగా ఆందోళనలు ● ఇరువర్గాల మధ్య వాగ్వాదం
● పోలీసుల చొరవతో సద్దుమణిగిన గొడవ

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్‌లో చేపట్టిన బీసీ బంద్ శనివారం ఉద్రిక్తతకు దారి తీసింది. బీసీ బంద్‌లో వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా పాల్గొని ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టారు. కాంగ్రెస్, సీపీఎం నాయకులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ డౌన్ డౌన్ అంటూ నినదించారు. అక్కడే ఉన్న బీజేపీ మండలాధ్యక్షుడు చట్ల వెంకటరమణ ఆధ్వర్యంలోని బీజేపీ నాయకులు రాస్తారోకో చేపడుతున్న సీపీఎం, కాంగ్రెస్ నాయకులకు ఎదురుగా జాతీయ రహదారిపై బైఠాయించి సీఎం డౌన్ డౌన్ అంటూ పోటీగా నినదించారు. దీంతో సీపీఎం, కాంగ్రెస్ నాయకులు బీజేపీ నాయకుల వైపు దూసుకొచ్చారు. అదే సమయంలో బీజేపీ నాయకులు వారికి ఎదురుగా దూసుకెళ్లే ప్రయత్నం చేయగా సీఐ వేణు, ఎస్సై వినయ్‌కుమార్ ఆధ్వర్యంలోని పోలీసులు ఇరు వర్గాలకు చెందిన నాయకులు వెనక్కి నెట్టారు. ముందుకు దూసుకొచ్చే ప్రయత్నం చేసిన ఇరువర్గాల నాయకులను అక్కడి నుంచి పోలీసులు చెదరగొట్టి గొడవ కాకుండా చర్యలు తీసుకున్నారు. తీవ్ర వాగ్వాదంతో పాటు ఎదురెదురుగా నాయకులు దూసుకొచ్చే ప్రయత్నం చేయగా కొన్ని క్షణాల పాటు జాతీయ రహదారిపై ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.

పోటా పోటీగా దిష్టిబొమ్మల దహనం

జఫర్‌గడ్(ఆంధ్రజ్యోతి): జఫర్‌గడ్‌లో వామపక్ష పార్టీలు, బీజేపీ నాయకుల పోటా పోటీగా దిష్టిబొమ్మలను దహనం చేశారు. తొలుత సీపీఎం, సీపీఐ పార్టీల శ్రేణులు బీసీల రిజర్వేషన్‌కు మద్దతుగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బిల్లుకు కేంద్రంలోని బీజేపీ మోకాలడ్డుతోందని ఆరోపిస్తూ స్థానిక సెంటర్‌లో బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. దీనికి ప్రతిగా బీజేపీ నాయకులు సాయంత్రం మండల కేంద్రంలో సీపీఎం, సీపీఐ పార్టీల దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

ముగిసిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

- పురుషుల 400 మీటర్ల హార్డిల్స్‌లో అరుణ్‌దీప్ మీట్ రికార్డు
- మహిళా హ్యామర్‌త్రోలో స్నేహకు స్వర్ణం
- పోటీల నిర్వహణ సక్సెస్



మహిళల ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో విజేతలుగా నిలిచిన అథ్లెట్లు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లోని సింథటిక్ ట్రాక్‌పై నిర్వహించిన 5వ జాతీయస్థాయి ఓపెన్ అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలు శనివారం అట్టహాసంగా ముగిశాయి. దేశం నలుమూలల నుంచి వచ్చిన ఒలంపియన్లు, అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లు, అనేక అంశాల్లో పోటీ పడుతూ పతకాలే లక్ష్యంగా చెమటోడ్చారు. హోరాహోరీగా తలపడి పాత రికార్డులను బద్దలు కొట్టారు. కొత్త రికార్డులను నమోదు చేశారు. చివరి రోజు మరో కొత్త రికార్డు నమోదైంది. పురుషల 400 మీటర్ల హార్డిల్స్‌లో కేరళకు చెందిన అరుణ్ దీప్ ఫైనల్‌లో 50.29 సెకండ్లతో కొత్త రికార్డు సృష్టించారు. అంతకుముందు బిలాస్‌పూర్‌కు చెందిన పి.యషస్(కర్ణాటక) పేరు మీదున్న 50.89 సెకండ్ల పాత రికార్డును అరుణ్‌దీప్ ఛేదించి ఈ కొత్త రికార్డు నెలకొల్పాడు. దీనితో ఈ జాతీయస్థాయి పోటీల్లో మొత్తం ఆరు కొత్తరికార్డులు నమోదైనట్లయింది.



పురుషుల 800 మీటర్ల పరుగు పందెంలో విజేతలకు మెడల్స్ అందజేస్తున్న నిర్వాహకులు, అతిథులు



మహిళా హ్యామర్‌త్రోలో స్వర్ణ పతకం సాధించిన హరియాణా అథ్లెట్ స్నేహ

నిరాశ మిగిల్చిన తెలుగు అథ్లెట్లు

మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ నుంచి 21, ఆంధ్రప్రదేశ్ నుంచి 6గురు మొత్తం 27 మంది అథ్లెట్లు ప్రాతినిథ్యం వహించినా.. ఒక్క మెడల్స్ సాధించకపోవడంతో క్రీడాభిమానులు, క్రీడాపోషకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎఫ్ఐ) సహకారంతో తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాలతో సహా మొత్తం 938 అథ్లెట్లు ఎంపిక కాగా, ఇందులో 55 మంది హాజరు కాకపోవడంతో 883 మంది అథ్లెట్లు 21 ఈవెంట్లలో తలపడి తమ ప్రతిభను చాటుకున్నారు.

విజయవంతంగా నిర్వహించాం..

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఓపెన్ అండర్-23 మెన్ అండ్ ఉమెన్ 100, 200, 400, 800, 1500, 5వేలు, 10వేల మీటర్ల పరుగు పందెంతో పాటు 20 కిలోమీటర్ల రేస్‌వాక్, 110, 400 మీటర్ల హార్డిల్స్ 3వేల మీటర్ల స్టీపుల్‌చేస్, హైజంప్, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్, పోల్ వాల్ట్, షాట్‌పుట్, హ్యామర్‌త్రో, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, డెకాథ్లాన్, హెప్టథ్లాన్, క్రీడాంశాల్లో మూడు రోజుల పాటు క్రీడలు పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించామని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి తెలిపారు. ఈ పోటీల్లో 883 మంది అథ్లెట్లు, 135 మంది టెక్నికల్ అఫిషియల్స్, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారన్నారు. చివరి రోజున పోటీల నిర్వహణలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు స్టాన్లీ జోన్స్, హనుమకొండ డీవైఎస్‌వో అశోక్‌కుమార్, సీఐలు సార్ల రాజు, పుల్యాల కిషన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, పింగిలి రమేష్‌రెడ్డి, రంగాపురం రమణ, ఊర యుగేందర్‌రెడ్డి, రామప్ప పోలీస్ అకాడమీ ఛైర్మన్ ఐలి చంద్రమోహన్‌గౌడ్, డీఎస్‌ఏ కోచ్ శ్రీమాన్, టెక్నికల్ అఫిషియల్స్ గంగిశెట్టి మనోజ్, వాసుదేవ్, సురేష్, రజినీకాంత్, దిమ్మిక నాగరాజు, వివిధ జిల్లాలకు చెందిన అసోసియేషన్ బాధ్యులు, టీం మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈవెంట్లలో విజేతలు..

- **పురుషుల 5వేల మీటర్ల పరుగుపందెంలో :** రషీద్ ప్రథమ(ఉత్తరప్రదేశ్), నిషాంత్ కరహన ద్వితీయ(హరియాణా), సందిప్పల్ తృతీయ(ఉత్తరప్రదేశ్).
- **మహిళల 5వేల మీటర్ల పరుగుపందెం:** సుప్రీత్‌కచప్ ప్రథమ(జార్ఖండ్), మితాలి రాక్ ద్వితీయ(మహారాష్ట్ర), లతిక్ తల్వార్ తృతీయ(రాజస్థాన్).
- **మహిళల హ్యామర్‌త్రో :** స్నేహ ప్రథమ(హరియాణా), ప్రతిభ ద్వితీయ(మధ్యప్రదేశ్), మిటల్ సోలాంకి తృతీయ (గుజరాత్).
- **పురుషుల జావెలిన్‌త్రో :** ఆనంద్‌సింగ్ ప్రథమ(ఉత్తరప్రదేశ్), ఆదిత్య ద్వితీయ(హరియాణా), పర్దీక్‌కుమార్ తృతీయ(హరియాణా)
- **మహిళల ట్రిపుల్ జంప్ :** పూర్వ రెష్వంత్ ప్రథమ(మహారాష్ట్ర), పీతి ద్వితీయ(రాజస్థాన్), మేరీ ముక్తసొరెంజ్ తృతీయ(ఒడిశా).
- **మహిళా 400 మీటర్ల హార్డిల్స్ :** హర్శిత ఆర్.ప్రథమ(తమిళనాడు), మౌమిజాన ద్వితీయ(ఎన్‌సీవోఈ పాటియాల), లౌలీ రాజ్‌పుత్ తృతీయ (ఉత్తరప్రదేశ్).
- **పురుషుల 400 మీటర్ల హార్డిల్స్ :** అర్జున్ ప్రదీప్ ప్రథమ(కేరళ), నటరాజ్ ద్వితీయ(తమిళనాడు), హర్దిప్‌కుమార్ తృతీయ(పంజాబ్).
- **మహిళల జావెలిన్‌త్రో :** కుషియాదవ్, ప్రథమ(రాజస్థాన్), సాలోని ద్వితీయ(హరియాణా), ప్రతిక్ష పటేల్ తృతీయ (ఉత్తరప్రదేశ్).
- **పురుషుల ట్రిపుల్ జంప్ :** విషాల్ బహదుర్ ప్రథమ(జార్ఖండ్), ప్రదీప్ ఎకుమార్ ద్వితీయ(ఉత్తరప్రదేశ్), నర్విందర్‌సింగ్ తృతీయ(పంజాబ్).
- **మహిళల 200 మీటర్ల పరుగుపందెం :** సుదిష్ణ ప్రథమ(మహారాష్ట్ర), ఆయూషీ ద్వితీయ(ఉత్తరప్రదేశ్), సమృతి జంవాల్ తృతీయ(హిమాచల్‌ప్రదేశ్).
- **పురుషుల 200 మీటర్ల పరుగుపందెం :** డొండపతి ప్రథమ(ఒడిశా), రాజబాబు ద్వితీయ(హరియాణా), ప్రతిక్ డి.తృతీయ(కర్ణాటక).
- **పురుషుల 800 మీటర్ల పరుగుపందెం :** సోమనాథ్ చాహన్ ప్రథమ (హరియాణా), ప్రత్మేష్ ద్వితీయ(మహారాష్ట్ర), షకీల్ తృతీయ(రాజస్థాన్).
- **మహిళల 800 మీటర్ల పరుగుపందెం :** లక్ష్మీతాద్ ప్రథమ(గుజరాత్),ప్రీతియాదవ్‌ద్వితీయ(మధ్యప్రదేశ్),ప్రతిక్షాయాదవ్‌తృతీయ(జేఎస్‌డబ్ల్యూ).
- **మహిళా హెప్టాథ్లాన్ :** కుషి ప్రథమ(బీఎస్ఎఫ్), నిక్కి కుమారి ద్వితీయ(బిహార్), ఇషా చందర్‌పార్క్ తృతీయ (ఉత్తరాఖండ్).
- **పురుషుల 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్ :** రాహుల్ ప్రథమ(హరియాణా), నవ్‌రతన్ ద్వితీయ(హరియాణా), రణ్‌వీర్ ఏటీఆర్ సింగ్ తృతీయ (గుజరాత్).
- **మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్ :** ప్రచిదేవ్‌కర్ ప్రథమ(మహారాష్ట్ర), సుష్మిత టిగ్గ ద్వితీయ(ఒడిశా), మంజుచౌదరి తృతీయ(రాజస్థాన్).

అథ్లెటిక్స్ పోటీల ఏర్పాట్లు బాగున్నాయి

- ఇండియా టీమ్ చీఫ్ కోచ్ రాధాక్రిష్ణన్



హనుమకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మన క్రీడాకారులు ప్రతిభావంతులని, ఇటీవల కాలంలో వివిధ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో వారు రాణిస్తున్న తీరే నిదర్శనమని అథ్లెటిక్స్ ఇండియన్ టీం చీఫ్ కోచ్ రాధాక్రిష్ణన్ అన్నారు. హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో జరుగుతున్న 5వ జాతీయ అథ్లెటిక్స్ ఓపెన్ అండర్-23 పోటీలను పర్యవేక్షించేందుకు వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు. జేఎన్ఎస్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న జాతీయ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. పోటీలను పర్యవేక్షిస్తున్న టెక్నికల్ అఫిషియల్స్‌కు, కోచ్‌లకు, ఇతర పర్యవేక్షకులకు బస, భోజన వసతి, ఇతరత్రా సౌకర్యాల కల్పనను ఆయన మెచ్చుకున్నారు. ఈ పోటీల్లో పాల్గొంటున్న అథ్లెటిక్స్‌కు వసతి, బస సౌకర్యాలు కల్పించకపోవడానికి నిధుల కొరతే కారణమన్నారు. జాతీయ అథ్లెటిక్స్ ఓపెన్ అండర్-23 పోటీలు వరంగల్‌లో జరగడం తెలంగాణకే గర్వకారణమన్నారు. ఈ పోటీల ప్రత్యక్ష ప్రసారంతో ప్రధానంగా వరంగల్‌కు దేశ వ్యాప్తంగా మంచి పేరు వస్తుందన్నారు. గతంలో 2022లో సింథటిక్ ట్రాక్ లేనప్పుడే ఇక్కడ నేషనల్స్ విజయవంతంగా జరిగాయని, ఇప్పుడు సింథటిక్ ట్రాక్ ఏర్పాటైన తర్వాత మొదటి సారి ఈ పోటీలు మరింత సమర్థవంతంగా సాగుతున్నాయని చెప్పారు.



జేఎన్ఎస్‌లో స్టీపుల్ చేజ్‌లో మహిళా అథ్లెట్లు



ట్రిపుల్ జంప్ చేస్తున్న మహిళా అథ్లెట్



హార్డిల్స్ పోటీల్లో పాల్గొన్న అథ్లెట్లు



స్టీపుల్ చేజ్‌లో పాల్గొన్న అథ్లెట్లు



జావెలిన్‌త్రోలో..

కాంగ్రెస్, బీజేపీ బీసీ ద్రోహుల పార్టీలు

- పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవాలి..
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసే వరకు పోరాటమే..
- శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి



హనుమకొండ బస్టాండ్‌లో బీఆర్ఎస్ నేతలతో ధర్నా చేస్తున్న సిరికొండ మధుసూదనాచారి

హనుమకొండ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నాయని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శనివారం హనుమకొండలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మధుసూదనాచారి పాల్గొని మాట్లాడారు. పోరాటాల ద్వారానే బీసీలు తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం పోరాటాల ద్వారానే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి బీసీ సమాజాన్ని మోసం చేసిందని విమర్శించారు. బీసీల రాజ్యాధికారం కోసం పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల కోసం 9వ షెడ్యూల్ ద్వారా ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చింతం సదానందం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మేడిపల్లి శోభన్‌బాబు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు పోలెపల్లి రాంమూర్తి, దాడి మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గర్జించిన బీసీలు

- బీసీ బంద్ విజయవంతం
- వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యాప్తంగా ర్యాలీలు
- జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు
- బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలు, ప్రజా సంఘాలు

హనుమకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా బీసీ సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడి శనివారం నిర్వహించిన తెలంగాణ బీసీ బంద్ హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రజలు, వివిధ ప్రజాసంఘాలు, జాతీయ, ప్రాంతీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, మేధావులు, యువకులు, కార్మిక, కర్షక వర్గాలు, ఉద్యోగులు, న్యాయవాదులు అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొన్నారు. బంద్‌ను పురస్కరించుకొని ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కలేదు. పాఠశాలలు బంద్ పాటించాయి. పెట్రోల్ బంక్‌లు పని చేయలేదు. ఆటో డ్రైవర్లు సైతం బంద్‌లో పాలుపంచుకున్నారు. బంద్ ప్రభావం స్పష్టంగా కనిపించింది.

బీసీ జేఏసీ బంద్ పిలుపులో భాగంగా బీసీ జేఏసీ నాయకులు, బీసీ సంక్షేమ సంఘం నేతలు, బీసీ విద్యార్థి సంఘం, బీసీ యువజన సంఘం నాయకులు, కాంగ్రెస్ బీఆర్ఎస్, కమ్యూనిస్టు, ప్రజా సంఘాల నేతలు ఉదయం 4గంటలకే రోడ్డుపైకి వచ్చారు. బస్ డిపోల వద్ద ధర్నా నిర్వహించారు. డిపోల నుంచి బస్సులు బయటకు రాకుండా అడ్డగించారు. హనుమకొండ బస్‌స్టేషన్ ప్రధాన గేట్ వద్ద బైఠాయించి బస్సులను అడ్డుకున్నారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట పట్టణాల్లోని విద్యా సంస్థలు, వాణిజ్య, వ్యాపార సంస్థలను, సినిమా థియేటర్లను, పెట్రోల్ బంక్‌లను స్వచ్ఛందంగా బంద్ చేయించారు. వరంగల్ బస్టాండ్ వద్ద కూడా బస్సులు రాకుండా అడ్డుపడ్డారు.



బంద్ సందర్భంగా వరంగల్-1, 2 డిపోల్లో నిలిచిపోయిన బస్సులు

హనుమకొండ జిల్లాలో..

బంద్‌లో భాగంగా కేయూ జంక్షన్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి నయీంనగర్, నక్కలగుట్ట, హనుమకొండ చౌరస్తా మీదుగా భారీ బైక్ ర్యాలీ సాగింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తానే స్వయంగా బైక్ నడుపుతూ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ ఛైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ నేతృత్వంలో సాగిన ఈ ర్యాలీలో వందలాది మంది పాల్గొన్నారు. బీసీలకు వారి జనాభా దామాష ప్రకారం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి సైతం బంద్‌లో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చేంద వరకు కాంగ్రెస్ పార్టీ విశ్రమించదన్నారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనన్నారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి మాట్లాడుతూ చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు కావలసిందేన్నారు. బీసీ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకవాలంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లును తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్పించి బీసీ రిజర్వేషన్ బిల్లుకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని కోరారు.

ములుగు రోడ్డు జంక్షన్‌కు చేరిన అనంతరం అక్కడి కూడలిలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు బైరి రవిక్రిష్ణగౌడ్, ఈవీ శ్రీనివాస్ రావు, దొడ్డపల్లి రఘుపతి, దాడి మల్లయ్య యాదవ్, బోనగాని యాదగిరి గౌడ్, తుమ్మల శోభారాణి, చిర్ర రాజు, తాళ్లపల్లి సురేష్, వైద్యం రాజు గోపాల్, బీమగాని యాదగిరి, తడక సుమన్ తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండలోని అమరవీరుల స్థూపం వద్ద మాట్లాడుతున్న ఓబీసీ ఛైర్మన్ సుందర్‌రాజు యాదవ్

ఓబీసీ ఛైర్మన్ సుందర్ రాజు యాదవ్ నేతృత్వంలో మరో ర్యాలీ హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ నుంచి సుబేదారిలోని అమరవీరుల స్థూపం వరకు సాగింది. పలు బీసీ సంఘాల నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమరవీరుల స్థూపం వద్ద ర్యాలీని ఉద్దేశించి సుందర్‌రాజు యాదవ్ మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్లను వారి జనాభా ప్రకారం అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన సాగిస్తామన్నారు. హనుమకొండ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో బీసీ జేఏసీ బంద్ సంపూర్ణంగా జరిగింది. నడికుడ మండలంలో జరిగిన బంద్‌లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. హసన్‌పర్తిలో బీసీ బంద్ సంపూర్ణంగా జరిగింది. పరకాలలో బంద్ సంపూర్ణంగా జరిగింది. ఎల్కతుర్తి, ధర్మసాగర్, భీమదేవరపల్లి, దామెర, శాయంపేట, కమలాపూర్ మండలాల్లో బంద్ ప్రశాంతంగా జరిగింది.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలో బీసీ బంద్ సంపూర్ణంగా జరిగింది. బస్సులు నడవకపోవడంతో వరంగల్ బస్టాండ్ నిర్మానుష్యంగా కనిపించింది. హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో సీపీఐ నాయకులు దుకాణాలను దగ్గరుండి మూయించారు. వరంగల్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు దుకాణాలను మూసివేయించారు. దుకాణాల మూతతో నిత్యం రద్దీగా ఉండే వరంగల్ మండిబజార్ ప్రాంతం బోసిపోయి కనిపించింది. పోచమ్మమైదాన్ సెంటర్‌లో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పర్వతగిరి మండలకేంద్రంలో బీసీ అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా, బైక్ ర్యాలీ జరిపారు. పోచమ్మమైదాన్ నుంచి కాంగ్రెస్, వరంగల్ స్టేషన్ నుంచి బీజేపీ, హెడ్‌పోస్టాఫీసు నుంచి ఎంసీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీలు సాగాయి. నర్సంపేట పట్టణంలో కూడా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

కేయూలో మార్కుల కలకలం

- అభ్యంతరాలను వ్యక్తం చేసిన విద్యార్థి నాయకులు
- సోషియాలజీ విభాగంలో మార్కుల షీట్ల పరిశీలన
- ప్రొఫెసర్లతో వాగ్వాదం.. 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



మార్కుల షీట్లను చూస్తున్న విద్యార్థి నేతలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో విద్యార్థుల సెమినార్ మార్కుల అంశం రగడ రేపుతోంది. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'చెత్త శుభ్రం చేస్తే ఎగ్జామ్‌లో పాస్' కథనంపై విద్యార్థి సంఘాల నేతలు స్పందించారు. కేయూ క్యాంపస్‌లోని సోషియాలజీ విభాగంలో నాలుగో సెమిస్టర్‌లో భాగమైన విద్యార్థుల సెమినార్‌కు కేటాయించిన మార్కుల షీట్లను శనివారం సాయంత్రం పరిశీలించారు. సోషియాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.స్వర్ణలత, బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ డాక్టర్ కుంట అయిలయ్యలతో విద్యార్థుల సెమినార్ మార్కుల షీట్లలో తేడాలు ఎందుకు ఉన్నాయంటూ ప్రశ్నించారు. కాన్ఫిడెన్షియల్‌గా ఉండే మార్కుల షీట్లను ఫొటోలు తీసుకోవద్దంటూ అధ్యాపకులు అభ్యంతరాలు చెప్పబోగా విద్యార్థులు ఎందుకు అంటూ వారితో వాగ్వాదానికి దిగారు. అయితే విభాగాధిపతి సంతకంతో చేసిన మార్కుల షీట్‌తో పాటు అదనంగా మరో మార్కుల షీట్ ఎందుకు ఉందని విద్యార్థులు ప్రశ్నించారు. రెండుమార్కుల షీట్ల పత్రాల్లో విద్యార్థులకు సెమినార్‌కు కేటాయించిన మార్కుల్లో స్వల్పంగా వ్యత్యాసాలున్నాయని విద్యార్థులు ఆరోపించారు.

ఇదిలా ఉండగా, ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ శనివారం ఉదయం సోషియాలజీ విభాగాన్ని సందర్శించారు. కథనంలో వచ్చిన అంశాల ఆధారంగా విద్యార్థులకు కేటాయించిన మార్కుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సెమినార్ మార్కుల్లో తేడాలున్నాయా? అంటూ విభాగాధిపతితో పాటు ఇతర అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. అయితే శనివారం బీసీ జేఏసీ బంద్ నేపథ్యంలో వర్సిటీలో బంద్‌ను పురస్కరించుకుని పూర్తి వివరాలను అందకుండానే వెనుతిరిగినట్లు సమాచారం. దీపావళి సెలవు తర్వాత మళ్లీ వచ్చి వివరాలన్ని సేకరిస్తానని అన్నట్లు సమాచారం. కాగా ఆరు నెలల కిందట సోషియాలజీ విభాగం రెండో ఏడాది నాలుగో సెమిస్టర్ సెమినార్ మార్కుల కేటాయింపు జరుగగా ఇప్పుడు తాజా వివాదం జరుగుతుంటంతో వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. అయితే విద్యార్థులెవ్వరూ నాలుగో సెమిస్టర్ సెమినార్‌కు సంబంధించిన అంశంలో ఫెయిల్ కాలేదని, అందరికీ మార్కులు కేటాయించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి వివరణ ఇవ్వాలని కేయూ ఉన్నతాధికారులు విభాగాధిపతిని ఆదేశించినట్లు తెలుస్తోంది.

దివ్వెల సందడి షురూ..

19న భోగి, 20న దీపావళి, 21న కేదారేశ్వర వ్రతాలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటిల్లిపాదినీ అలరించే దివ్వెల పండుగ రానే వచ్చింది. ఈ నెల 19 నుంచి భోగి పండుగతో ప్రారంభమయ్యే వేడుకలు 21న నోములతో ముగుస్తాయి. 20న దీపావళి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోనున్నారు. దివ్వెల పండుగ వచ్చిందంటే ఇళ్లల్లో సందడి కనిపిస్తుంది. భోగి స్నానాలతో ప్రారంభమై కేదారీశ్వర వ్రతాలు నోములు ఎత్తుకునే వరకు వేడుకలు జోరుగా సాగుతాయి. దీపావళి పండుగను పురస్కరించుకొని పూల దుకాణాలు, నోము సామానులు, టపాకాయల దుకాణాల్లో అమ్మకాలు మొదలయ్యాయి. శుక్రవారం సాయంత్రం నుంచే సందడి మొదలైంది. లక్ష్మీ రోజు కావడంతో నోము సామానులు దీప ప్రమిదల కొనుగోళ్లు ప్రారంభించారు.



నోము సామాను విక్రయిస్తున్న వృద్ధుడు


మహిళపై చేయిచేసుకున్న బీసీ నేతలు

- బాధిత మహిళ బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కావడంతో ఉద్రిక్తత
- బీసీ నేతలను బాధిత కుటుంబీకులతో కలిసి నిలదీస్తున్న బీజేపీ శ్రేణులు



చేయి చేసుకున్న బీసీ నేతలను నిలదీస్తున్న బాధిత మహిళ మంగమ్మ

మరిపెడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళపై బీసీ నేతలు చేయిచేసుకున్న సంఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్ కేంద్రంలో చోటుచేసుకుంది. బాధిత మహిళ భూక్యా మంగమ్మ బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కావడంతో కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సకాలంలో మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై కోటేశ్వర్‌రావు సిబ్బందితో అక్కడికి చేరుకొని ఘర్షణ వాతావరణాన్ని శాంతపరిచారు. ఆ మహిళ బీజేపీ శ్రేణులతో కలిసి మరిపెడ ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ దగ్గర రాస్తారోకో చేస్తున్న బీసీ నేతలను పోలీసుల ఎదుటే నిలదీశారు. పోలీసులు బాధిత కుటుంబ సభ్యులను, బీజేపీ శ్రేణులను అక్కడి నుంచి బయటకు పంపించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ బస్టాండ్ కాంప్లెక్స్‌లో కంగన్‌హాల్ తెరిచి ఉంచగా, 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బీసీ నేతలు బంద్ నిర్వహిస్తున్నారు. బస్టాండ్ సెంటర్లో కంగన్‌హాల్ తెరిచి ఉండగా అక్కడికి వెళ్లి షాపు బంద్ చేయాలని వారు హల్‌చల్ చేశారు. దీంతో ఆ షాపు నిర్వాహకులు బంద్ చేయడానికి సామానులు సర్దుతుండగా మంగమ్మ భర్త లింగంనాయక్ చెంపపై బీసీ నేతలు కొట్టడంతో మంగమ్మ షాపు బంద్‌చేస్తూనే ఉన్నాం కాదా? ఎందుకు కొడుతున్నారని వాగ్వివాదానికి దిగింది. దీంతో బీసీ నేతలు ఆమెపై చేయిచేసుకొన్నారు. ఆమె చేతికి, వీపుపై దెబ్బలు తగిలాయి. ఈ ఘటనపై మంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై విచారణ జరుపుతున్నట్లు మరిపెడ అదనపు ఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపారు.



పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

కాటారం, అక్టోబరు 17(ఆంధ్ర జ్యోతి):యూత్ కాంగ్రెస్ గ్రామస్థాయి నూతన కమిటీలను ఎన్నుకుని పార్టీ పటిష్టతకు సమష్టిగా కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీటూరి మహేష్‌గౌడ్ అన్నారు. మండలంలోని ధన్వాడలో రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గృహంలో శనివారం యూత్ కాంగ్రెస్ మండలస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అజీజ్, మాజీ సర్పంచ్ అశోక్, విక్రమ్, శ్రీకాంత్, రాజు, మహేష్ ఉన్నారు.

‘మేమెంతో మాకంత..’

- ఉద్యమించిన బీసీలు
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విజయవంతంగా బీసీ బంద్
- నినాదాలతో మార్మోగిన రహదారులు

ములుగు టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల 42 శాతం రిజర్వేషన్‌పై హైకోర్టు స్టేను నిరసిస్తూ బీసీ సంఘాల నాయకులు బంద్‌కు పిలుపునిచ్చిన విషయం విధితమే. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా బంద్ సంపూర్ణమైంది. అన్ని రాజకీయ పార్టీలతో పాటు ప్రజా సంఘాలు ఈ బంద్‌కు మద్దతు తెలిపాయి. వ్యాపార వర్గాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి. కాగా అత్యవసర సేవలు అందుబాటులోనే ఉన్నాయి. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్, బిజేపి, బీఆర్ఎస్, సిపిఎమ్, ప్రజా సంఘాల నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు

● ఏటూరునాగారం : రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బీసీ బంద్‌కు మండలంలోని అన్ని పార్టీల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఈ బంద్‌కు మద్దతుగా మండలం లోని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, ఎస్ఎఫ్ఐ, గీత కార్మికుల మండల కమిటీల ఆధ్వర్యంలో బంద్ కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించారు. అనంతరం, రామాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ నాయకులు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు మాట్లాడారు. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ అనుముల శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎస్సై ఎన్. రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, సప్పిడి రాంనర్సియ్య, జాడి బోజారావు, బట్టు రమేష్, బట్టు గోపి, వావిలాల ముత్తయ్య, కాళ్ల రామకృష్ణ, మెరుగు వెంకటేశ్వర్లుతో పాటు కుల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

● గోవిందరావుపేట : మండలంలో బీసీబంద్ శనివారం విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు, బ్యాంకులను స్వచ్ఛందంగా మూసివేశారు. బంద్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్‌పార్టీ బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులుగుజ్జు వెంకన్న మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణనాయకులు జెట్టి సోమయ్య, తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహనాయక ఆధ్వర్యంలో నాయకులు మండలకేంద్రంలో ఆందోళన చేపట్టారు. మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాసరెడ్డి, నాయకులు స్వరూప, అక్కినపల్లి రమేష్, అజ్మీరా సురేష్, చందర్‌రాజు, పున్నం, రాంచందర్ కొండి రమేష్, చుంచు యాకోబ్,రాజశేఖర్, రుద్రబోయిన మల్లేష్, పాల్గొన్నారు. బీసీబంద్‌కు ఎమ్మార్పీఎస్ పూర్తిస్థాయి మద్దతు ప్రకటించింది.ఇందులో భాగంగా మండలంలోని పస్రాలో ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు, ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జి ఇరుగు పైడి, జిల్లా నాయకులు తోకల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

● కన్నాయిగూడెం : 42 శాతం రిజర్వేషన్స్ కల్పించాలని చెప్పి బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం బందుకు పిలుపు నివ్వగా బంద్ ప్రశాంతంగా, విజయవంతమైంది. ఈ బందుకు అన్ని పార్టీలు మద్దతు తెలిపాయి. ప్రభుత్వం ఇచ్చిన బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ ను సవాల్ చేస్తూ రాష్ట్ర హై కోర్టులో కేసు వేసిన మాధవరెడ్డి దిష్టి బొమ్మను మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయం ముందు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ మండల అధ్యక్షుడు ముదురుకోళ్ల భిక్షపతి, అబ్బు సతీష్, చిట్టెం శీనివాస్, కాంగ్రెస్ మండల పార్టీ ఇన్ చార్జి జాడి రాంబాబు, బోట నాగేష్, బొల్లె భాస్కర్, చీదారి సుమన్, పూజారి సత్యనారాయణ పాల్గొన్నారు.

● వెంకటాపురం : బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బీసీసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బీసీబంద్ శనివారం మండలంలో విజయవంతమైంది. ఈసందర్భంగా హోటళ్లు, కిరాణషాపులు, బట్టల షాపులను వ్యాపారులు స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు మద్దతు ఇచ్చారు. ఆటోలు, బస్సులు తిరగలేదు, పెట్రోల్ బంకులు తెరుచుకోలేదు. ఈ సందర్భంగా వాడబలిజ సేవాసంఘం, మున్నూరుకాపు సంఘం, పెరిక సంఘం, బీసీసంఘాల ఆధ్వర్యంలో నాయకులు మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, వాడబలిజ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఢర్రా దామోదర్, మున్నూరుకాపు సంఘం నాయకులు జల్లిగంపల కళాధర్, గార్లపాటి గోపి పాల్గొన్నారు.

● వాజేడు :బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో శనివారం మండలంలో బంద్ విజయవంతమైంది. వాడబలిజ సేవాసంఘం ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా బంద్ కొనసాగింది. బీసీబంద్‌కు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, యాదవసంఘం, బీసీ సంఘాలు మద్దతు ప్రకటించాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాలను నాయకులు మూసివేయించారు. అదేవిధంగా 163వ జాతీయ రహదారి గొల్లగూడెం, జగన్నాథపురం వైజంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బీసీ సంఘం ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పూనెం రాంబాబు, వాడబలిజ సేవాసంఘం అధ్యక్షుడు గారా నాగార్జునరావు, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమల్లు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● చిట్యాల : బీసీ జేఏసీ పిలుపు మేరకు మండల వ్యాప్తంగా శనివారం బంద్ సంపూర్ణంగా జరిగింది. అన్ని గ్రామాల్లో వ్యాపార సంస్థలు, పెట్రోల్ బంక్‌లు స్వచ్ఛంద బంద్ పాటించగా ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు మూతబడ్డాయి. పలు పార్టీలు, సంఘాల నాయకులు మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ద్విచక్ర వాహనాల ర్యాలీ తీశారు. చిట్యాల ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవిసత్యనారాయణ, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి, బుర్ర వెంకటేష్, అల్లం రవీందర్, ఏవైఎస్ రాష్ట్ర నాయకుడు పుల్ల మల్లయ్య, ధర్మసమాజ్‌పార్టీ జిల్లా నాయకుడు శీలపాక నాగరాజు, పలు సంఘాల నాయకులు చేపూరి ఓదెలు, మొగులోజు భగవత్‌చారి, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొంరు, ఏకు రవి, బుర్ర శ్రీనివాస్, అల్లకొండ కుమార్, గుండ సురేష్, చెక్క నర్సయ్య, షైదం శ్రీకాంత్, రాయిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్ ప్రధాన రహదారిపై సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈసందర్భంగా పార్టీ మండల కార్యదర్శి చింతల రజినికాంత్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

● క్రిష్ణకాలనీ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా చూడాలని బీసీ, ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ బ్రాంచి ఉపాధ్యక్షులు సిరివేరు మురళీమోహన్ కోరారు. ఈ మేరకు శనివారం భూపాలపల్లిలో బీసీ రిజర్వేషన్ బంద్‌కు మద్దతూగా సింగరేణి బీసీ,ఓబీసీ అసోసియెషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, కార్యదర్శి రమేష్ ఆదేశానుసారం సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్‌ను అసోసియేషన్ సభ్యులతో కలిసి మెమోరాం ండాన్ని సమర్పించారు. అలాగే, కేటీకే 8 ఇంక్లైన్ గని మేనేజర్‌ను సైతం కలిసి విజ్ఞప్తి చేశారు. జనాభా ప్రాతిపాధికన బీసీలకు న్యాయంగా రావాల్సిన రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు. బ్రాంచి సెక్రటరీ నవీన్, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుండు రాజు, జాయింట్ సెక్రటరీ విద్యాసాగర్, ట్రెజరర్ రాణా ప్రతాప్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ అశోక్, చంద్రగిరి శంకర్, సురేష్, పసునూటి రాజేందర్, సాయి ప్రసాద్, రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.

● కాటారం :బీసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు బీసీలకు 42శాతం రిజ ర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ శనివారం చేపట్టిన బీసీ బంద్ మండలవ్యాప్తంగా సంపూర్ణంగా విజయవంతం అయింది. బంద్‌ను విజయవంతం చేయడానికి మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, డీఎస్పీ పార్టీల నాయకులు, ఎస్ఎఫ్ఐ నేతలు, పలు బీసీ కుల సంఘాల, ప్రజా సంఘాల నాయకులు ర్యాలీలు, ధర్నాలు చేపడుతూ పర్యవేక్షించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్ మండల అధ్యక్షుడు మహేష్, మహిళా అధ్యక్షురా లు జాడి మహేశ్వరి, బీఆర్ఎస్ మండల ఇంచార్జి జోడు శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్మరణ్, డీఎస్పీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు పంతకాని సమ్మయ్య, గద్దె సమ్మిరెడ్డి, నాయిని శ్రీనివాస్, రమేష్‌రెడ్డి, చీమల రాజు, కడారి విక్రమ్, రాజేషం, తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కుమార్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, బాసాని రవి, సడువలి, దేవానాయక్, విక్రమ్, మనోహర్, మురారి, ప్రశాంత్, అశోక్, భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

● మహాముత్తారం : మండలంలో రాష్ట్ర బీసీ జేఏసీ ఇచ్చిన బంద్ పిలుపు మేరకు మండలంలో బంద్ సంపూర్ణంగా ముగిసింది. శనివారం ఉదయం నుంచే వేర్వేరుగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపి, సీపీఎం, బీసీ సంఘాల నాయకులు గ్రామాలలో తిరుగు దుకాణాలను మూసివేయించారు. ఈ సందర్భంగా యామన్‌పల్లిలో కాటారం మేడారం రోడ్డులో అఖిల పక్షం నాయకులు రాస్తా రోకో నిర్వహించారు.

● మహదేవపూర్ రూరల్ : రాష్ట్రంలో మేమెంతున్నామో.. మాకంత రిజర్వేషన్ కల్పించాల్సిందేనని బీసీ సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బీసీ రిజర్వేషన్ కోసం చేపట్టిన బంద్ విజయవంతం కావడంతో నాయకులు మాట్లాడారు. బంద్ నిర్వహిస్తున్న బీసీ సంఘాల నాయకులకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. శ్రీపతిబాపు, పోత వెంకటస్వామి, అక్బర్‌ఖాన్, కారెంగుల బాపురావు, సిరంగి రవీంద్, సల్మాన్ ఖాన్, బెల్లంపల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సరైన న్యాయం చేయాలని బీసీ కుల జేఏసీ పిలుపునిచ్చింది. రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు శనివారం బీసీ బంద్ విజయవంతమైంది. మహదేవపూర్ మండల కేంద్రంలో బీసీ నాయకులు నినాదాలు చేశారు. బంద్‌కు బీసీ ఐక్య వేదిక కాటారం డివిజన్ నాయకులు సముద్రాల తిరుపతి, బీసీ కుల సంఘాల జేఏసీ నాయకులు శ్రీ పతిబాపు, అక్బర్‌ఖాన్, పోత వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుంది బీజేపీయే

భూపాలపల్లిటౌన్ : బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుంది బీజేపీయేనని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. శనివారం భూపాలపల్లి పట్టణంలో వివిధ సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్‌కు ఎమ్మెల్యే సంపూర్ణ మద్దతు తెలుపుతూ పాల్గొన్నారు. అలాగే హనుమాన్ దేవాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేయగా వారి మనుగడ ఎక్కడ దెబ్బతింట ుందోననే దురుద్దేశ్యంతో బీజేపీ పార్టీ అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, సుంకరి రాంచంద్రయ్య, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, దాట్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, తిరుపతిగౌడ్, పైడిపల్లి రమేష్, శ్రీరాములు, సాంబమూర్తి, ముంజాల రవీందర్, తదితరులు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్లు 42శాతం అమలు చేయాల్సిందేనని తలపెట్టిన బీసీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బంద్ పిలుపులో భాగంగా భూపాలపల్లి పట్టణంలో బీసీ సంఘాల నాయకులు టూవీలర్లపై గస్తీ నిర్వహించారు. ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేసి బస్సులు నడపవద్దని అధికారులకు విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్నం 3గంటల వరకు కూడా ఒక్క బస్సు కూడా బయటికి వెళ్లలేదు. కాంగ్రెస్‌తో పాటు సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీసీ సంఘం కండువాలు కప్పుకుని తిరిగడం చర్చనీయాంశమైంది. బంద్ సందర్భంగా పోలీసులు సైతం గస్తీ నిర్వహించారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు,బీసీ జేఏసీ నాయకులతో సహా అంతా రోడ్డుపైకి వచ్చి ఆందోళన కార్య క్రమాలు చేయడంతో పోలీసులు సైతం అప్రమత్త మయ్యారు. పట్టణం లో అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు.


వాజేడులో నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు


మహదేవపూర్‌లో నినాదాలు చేస్తున్న బీసీ నాయకులు


భూపాలపల్లిలో ర్యాలీ తీస్తున్న వివిధ సంఘాల నాయకులు


చిట్యాలలో బీసీ బంద్‌లో పాల్గొన్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు


మహాముత్తారం యామన్‌పల్లిలో..


వెంకటాపురంలో నిరసన తెలుపుతున్న బీసీ నాయకులు


గోవిందరావుపేటలో బీసీ నాయకుల ధర్నా



కన్నాయిగూడెంలో బంద్‌లో నినాదాలు చేస్తున్న నాయకులు


ఏటూరునాగారంలో నినాదాలతో వస్తున్న బీసీ నాయకులు


భూపాలపల్లి ప్రధాన రహదారిలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర


పెట్రోల్ బంకులో మోసం

- గుర్తించిన వినియోగదారుడు


వివరాలు తెలుపుతున్న వినియోగదారుడు

మల్హర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తాడిచర్లలోని ఓ పెట్రోల్ బంకులో మోసాన్ని గుర్తించి వినియోగదారుడు నిలదీసిన ఘటన మండల కేంద్రమైన తాడిచర్లలో శనివారం చోటు చేసుకుంది. తాడిచర్ల గ్రామానికి చెందిన నర్సింగరావు తన ద్విచక్ర వాహనంలో రూ. 640ల పెట్రోల్ కొట్టాలని ముందుగానే సిబ్బందికి డబ్బులు చెల్లించాడు. తన ముందు ఉన్న ద్విచక్ర వాహనానికి పెట్రోల్ కొట్టి అలాగే తన వాహనంలో పెట్రోల్ కొట్టడాన్ని గుర్తించాడు. గతంలో కూడా ఇలాగే తన ట్రాక్టర్లలో డీజిల్ పోయించుకునేందుకు రాగానే ఇలాగే జరిగిందని వివరించాడు. బంకుపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. పెట్రోల్ బంకు నిర్వహణ, జిల్లా అధికారుల పనితీరుపై సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత జరిగినా జిల్లా అధికారులు బంకు నిర్వహణపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది సర్వత్రా చర్చ జరుగుతుంది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కాటారం, అక్టోబరు 18(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ (బాలుర) గురుకుల కళాశాలకు చెందిన ఎస్ చరణ్, ఎస్ రామ్‌తేజ్ అనే విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి వరంగల్‌లో ఈ నెల14న జరిగిన అండర్-17 వాలీబాల్ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎ ఫ్‌ఐ కార్యదర్శి జైపాల్ తెలిపారు. గురుకులంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యా ర్థులను ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపా ల్స్ మాధవి, వెంకటయ్య, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేష్, డిప్యూటీ వార్డెన్ బలరాం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

ములుగు రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ యూనిట్-4 యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన ఏడు రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో స్వయం సహాయక సంఘాలతో మహిళా సాదికారత, మహిళల అభివృద్ధి అంశాలపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘం సీఏ అజ్మీర వనిత మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అజ్మీర రమేష్ వలంటీర్ల ఉత్సాహాన్ని అభినందించారు. ఇటువంటి పరస్పర చర్చల వల్ల గ్రామీణ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. మహిళా సంఘాల ప్రతినిదులు జి.రజిత, ఎ.జయసుధ, మహిళా సంఘ సభ్యులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు

క్రిష్ణకాలనీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్, బక్కి వెంకటయ్యను మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్‌తో కలిసి సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షు లు గోళ్ల రమేష్, ప్రధాన కార్యదర్శి భూక్య కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కలిసి సింగరేణి గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మెమోరాండం సమర్పించారు.


మెమోరాండం సమర్పిస్తున్న సింగరేణి గిరిజన ఉద్యోగులు

సొంత గూటికి చేరిన పీఏసీఎస్ డైరెక్టర్


రాజబాపుకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

కాటారం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంకుసాపూర్ గ్రామానికి చెందిన గారెపల్లి సింగిల్ విండో డైరెక్టర్ ఆయిలి రాజబాపు కాంగ్రెస్ పార్టీ నుంచి తిరిగి సొంతగూటికి చేరారు. బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజబాపు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు సమక్షంలో పార్టీలో చేరగా గులాబీ కండువా కప్పి మధు పార్టీలోకి ఆహ్వానించారు. గత ఏడాది పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం సందర్భంగా బీఆర్ఎస్ నుంచి ఐలి రాజబాపు కాంగ్రెస్‌పార్టీలో చేరిన విషయం విధితమే. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పంతకాని సడువలి, పూర వెంకటేశ్వర్‌రావు, కూర దేవేందర్, సంతోష్, జాడి శ్రీశైలం, రాజేంద్రచారి ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈవో

మహదేవపూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ప్రకాష్‌బాబు శనివారం సందర్శించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థుతో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ 10వ తరగతి స్పెషల్ క్లాసులు సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల గణిత సామర్థ్యాలు పరీక్షించారు. వారి వెంట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు బి.అన్నపూర్ణ, డీసీఈబీ సెక్రటరి కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం


రాజబాపును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

మహదేవపూర్/మహదేవపూర్ రూరల్ అక్టోబరు 18(ఆంధ్ర జ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాపును టీడీపీ నాయకులు శనివారం సన్మానించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ కమీషన్ మాజీ సభ్యుడు, తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజు నాయక్, పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ అందే భాస్కర చారి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అవకాశం రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు.

గుడుంబా స్వాధీనం

- ఒకరిపై కేసు నమోదు

ఏటూరునాగారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న ఒక మహిళపై పోలీసులు దాడులు చేసి, గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నరిగా రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని వంగపల్లి కవిత అనే మహిళ గత కొంతకాలంగా చట్టవిరుద్ధంగా గుడుంబాను విక్రయిస్తున్నట్లు ఎస్సైకి పక్కా సమాచారం అందింది. దీనితో శనివారం సాయంతం ఎస్సై రాజ్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి కవిత ఇంటిపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీలలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఎనిమిది లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అక్రమంగా గుడుంబా తయారు చేసినా నాటుసారా అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తయారీదారులను, విక్రయదారులను హెచ్చరించారు. ఈ దాడులలో ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.